www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

5

చిత్తూరు

బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తులకు

12 వరకు గడువు పెంపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ప్రభుత్వమందిస్తున్న బీసీ కార్పొరేషన్ల రుణాలను అర్హులందరికీ అందజేయడానికి, లబ్ధిదారుల నుంచి వస్తున్న వినతులను దృష్టిలో పెట్టుకుని బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సహా వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్న యూనిట్లకు దరఖాస్తుల గడువును ప్రభుత్వం ఈ నెల 12వ తేదీ వరకూ పెంచడం జరిగిందనీ, అర్హులైన నిరుద్యోగ యువత స్వయం ఉపాధి యూనిట్ల స్థాపన కొరకు దరఖాస్తులు ఈనెల 12లోపు అప్లై చేసుకోవాలని జిల్లా బీసీ కార్పొరేషన్ కార్యనిర్వహణాధికారి శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రాక్టికల్.. ప్రాబ్లమ్స్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ బుధవారం నుండీ అంటే ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. ఈనెల 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో 69 సెంటర్లలో మొదటి, ద్వితీయ ఇంటర్ చదువుతున్న 12,311 మంది విద్యార్థులు ఈ ప్రాక్టికల్ పరీక్షలు రాయనున్నారు. ఇందులో బుధవారం నుండీ ఈనెల 9వ తేదీ వరకు ఒకేషనల్ కోర్సు చదువుతున్న విద్యార్థులు 11 పరీక్షా కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలకు రాస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లు, ఆర్టీసి బస్సు సౌకర్యం ఇలా ఏర్పాట్లు విషయం అలా ఉంచితే... ప్రాక్టికల్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సైన్సు ల్యాబ్స్‌లో సరైన సౌకర్యాలు లేక తలెత్తున్న సమస్యలు రసాయనాల కొరత వంటి వాటి వలస సైన్సు విద్యార్థులకు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది.

ప్రాక్టికల్ పరీక్షలకు నిర్వహణా కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో సైన్సు ల్యాబ్స్‌లో అనేక ఇబ్బందులున్నాయి. ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల్లో ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలు ఎంపిక చేసినా అనేక కళాశాలల్లో రోజుల తరబడీ ల్యాబ్‌లు శుభ్రం చేయకపోవడం వల్ల సైన్సు పరికరాలు తుప్పు పట్టిపోయి ఉంటున్నారు. కొన్ని ప్రయివేటు కళాశాలలు తమ విద్యార్థి విద్యార్థులకు అత్యధిక మార్కులు వచ్చేలా ప్రయత్నిస్తున్నారు. ఇందు కోసం ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాల్లోని ఇన్విజిలేటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ ప్రారంభమైన మొదటి రోజే ప్రాక్టికల్స్‌కు హాజరైన విద్యార్థులకు సైన్సు ప్రయోగశాలల్లో పరికరాలు, రసాయనాల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వచ్చింది. ప్రాక్టికల్ ప్రయోగాల కోసం 24రకాల లవణాలు, బ్యూరెట్స్, పిపెట్లు, స్టాండ్స్, బేకర్స్ టెస్ట్ ట్యూబ్, బాయిలింగ్స్ టెస్ట్ ట్యూబ్స్, వివిధ రకాల కిట్లు అవసరం. పగడ్బందీగా ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నామని ప్రకటించిన అధికారులు ప్రయోగాలకు అవసరమైన అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని ప్రాక్టికల్ పరీక్షలకు హాజరౌతున్న విద్యార్థులు కోరుతున్నారు.

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

రోజు రోజుకు మహిళలు, బాలికలపై అత్యాచారాలు, వేధింపులు పెరుగుతున్నాయి.. రోజూ ఏదో మూలన బాలికలు, మహిళలపై దాడులు, అత్యాచారాలు, వేధింపులు, హత్యలు వంటి ఘటనలు నిత్యం వెలుగుచూస్తున్నాయి. ప్రస్తుత సమాజంలో మహిళను శక్తిహీనురాలిగా చూస్తున్నారు. సంప్రదాయం ముసుగులో బాధలన్ని భరించాలని చిన్న వయసు నుండీ నూరిపోస్తున్నారు. దీంతో ఇంటి బయట అవమానాలు, అవహేళనలు భరించాల్సి వస్తోంది. ర్యాగింగ్ చట్టవ్యతిరేకం.. అలాంటిది కళాశాల ఆవరణం, బయట బాలికలు నిత్యం ర్యాగింగ్‌ను ఎదుర్కొంటున్నారు.

బాలికల్లో ఆత్మస్థైర్యం పెంచడానికే

'రాణీ లక్ష్మీబాయి ఆత్మ రక్షణ'

ఇక బస్సులు, ఆటోలు, ప్రైవేట్ వాహనాల్లో స్త్రీలకు ప్రత్యేక సీట్లు కేటాయించినా నిబంధనలు అమలు కావడం లేదు.. స్త్రీలను గౌరవించాలంటూ రాస్తున్నా అవి ఆచరణలో ఉండటం లేదు. మరీ స్మార్ట్ ఫోన్లు వచ్చాక ఆడపిల్లల అశ్లీక చిత్రాల మాఫింగ్, చాటింగ్స్, ఫేస్ బుక్, ట్విట్టర్‌లో చాటింగ్ చేస్తూ వేధింపులు, బెదిరింపులకు పాల్పడుతున్నారు. మరోవైపు హిందు మతం, సంస్కృతి సాంప్రదాయం పేరుతో ప్రేమికుల రోజున అమ్మాయి అబ్బాయి కనిపిస్తే చాలు ప్రేమికులు అంటూ ముద్రవేసి బలవంతంగా వివాహాలు చేస్తున్నారు.. ఇటువంటి కాషాయ మూకలు, మూర్ఖులు వున్న సమాజంలో బాలికలు తమను తాము కాపాడుకునేందుకు అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలి.. మహిళలు పురుషులకంటే ఎందులోనూ తక్కువ కాదనే భావన పెరగాలి.. ఎటువంటి సమస్య ఎదురైనా ఎదురుతిరిగి పోరాడాలి ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని 6 నుంచి 9వ తగరతి విద్యార్థినులకు రాణి లక్ష్మీబాయ్ ఆత్మరక్షణ కార్యక్రమం ద్వారా కరాటేలో శిక్షణ ఇస్తోంది. ఇందుకోసం జిల్లాలోని మండల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలు, ఆదర్శ పాఠశాల, మున్సిపల్ పాఠశాలు, సంక్షేమ, గిరిజన, హైస్కూల్ ప్లస్ పాఠశాల్లోని బాలికలకు శిక్షణ మొదలు పెట్టింది. రాణి లక్ష్మబాయి ఆత్మరక్ష పరిశీలన – ఆత్మరక్ష ప్రశిక్షణ్ (ఆత్మరక్షణ శిక్షణ) పథకం కింద కరాటే లేదా ట్రైక్వాండ్ వంటి స్వీయ సంరక్షణకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో మండల పరిక్షత్ ప్రాథమిక పాఠశాల పరిధిలోని 6,7,8 చదువుతున్న 2050 విద్యార్థునులకు, ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలలు, మునిసిపల్ పాఠశాలలు, సామాజిక సంక్షేమ పాఠశాలల్లో 6 నుండి 9 తరగతులు చదువుచున్న 31,570 మంది విద్యార్థినులకు అనుభవం కలిగిన కరాటే, ట్రైక్వాండో శిక్షకుల ద్వారా రోజుకు ఒక గంట పాటు పాఠశాల ఆవరణంలోనే బాలికలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ కోసం కరాటే, ట్రైక్వాండో మాస్టర్లును రిజిస్టర్ సొసైటీ, ట్రస్ట్ నుంచి మూడు సంవత్సరాల అనుభవం కలిగిన మాస్టర్స్‌ను నియమించనున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా వీరి నియామకం చేపట్టనున్నారు. జిల్లాలో పనిచేసేందుకు ఆసక్తి కగిలిన కరాటే, ట్రైక్వాండో మాస్టర్లు ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు సమగ్ర శిక్షా అబియాన్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తులు చేసుకోవచ్చు. పూర్తిస్థాయిలో కరాటే, ట్రైక్వాండో మాస్టర్ల నియామకం పూర్తి చేసిన తరువాత వచ్చే ఏడాది నుండీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కరాటే, ట్రైక్వాండో శిక్షణ ఇవ్వనున్నారు. రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ పథకం ఫలించి పాఠశాల బాలికల్లో ఆత్మస్థర్యం పెరగాలని... నేటి బాలికలే రేపటి భావిభారత పౌరులుగా ర్యాగింగ్ బూతాన్ని, వేధింపులను ఎదుర్కొవాలని ఆశిద్దాం.

కళ్లు ఆర్పితేనే కూలి

- 'ఉపాధి' యాప్‌ల్లో నూతన సాంకేతికత
- కూలీల మస్టర్ ఫొటో తప్పనిసరి
- జనవరి 27 నుంచి అమల్లోకి...

ప్రజాశక్తి - యాదమరి (చిత్తూరు)

'ఉపాధి' యాప్‌ల 'వ్యథ'.. కూలీల ఉసురుతీయనుంది.. ఏవేవో అక్రమాలు జరిగిపోతున్నాయని పొంతనలేని కారణాలు చెబుతూ కేంద్ర ప్రభుత్వం జనవరి 27 నుంచి కొత్త నిర్ణయాలను అమల్లోకి తీసుకొచ్చింది. 'కూలీల దొంగ మస్టర్ నమోదుకు' కళ్లెం వేయడమే ఈ యాప్ ఉద్దేశమని ఉపాధి అధికారులు చెబుతున్నారు. ఫొటో తీసేటపుడు కూలీల్లో ఎవరో ఒకరు ఖచ్చితంగా కళ్లు ఆర్పితేనే ఆ మస్టర్ బిల్లు యాక్టివేట్ అవుతుందన్నమాట.



ఉపాధి కూలీలకు మస్టర్ వేస్తున్న దృశ్యం

చిత్తూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 31 మండలాలు ఉన్నాయి. 1,38,747 కుటుంబాలు ఉపాధి హామీ పథకంలో భాగస్వామ్యమై ఉన్నాయి. వీరు 6 లక్షల 55వేలకు పైగా ఉపాధి పని దినాలను ఈ ఏడాది చేసి ఉన్నారు. అయితే ఉపాధి హామీ పథకంలో కొత్తగా తీసుకొచ్చిన యాప్‌లతో ప్రతిరోజూ ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారానే పనుల వివరాలను నమోదు చేయాలి. ఇందులో కూలీలు పనిచేసే సమయంలో ఉపాధి సిబ్బంది తీసే ఫొటోలు ఉండే వ్యక్తుల సంఖ్య, అక్కడ పని చేసే కూలీల సంఖ్య ఒకటిగా ఉంటేనే ఆ మస్టర్‌లో కూలీలు పనికి హాజరైనట్లు పరిగణించి వారికి వేతనాలను చెల్లిస్తారు. అలాకాకుండా ఫొటోలో ఉండే కూలీల సంఖ్య మస్టర్ షీట్లో పేర్కొనే సంఖ్యకు ఏమాత్రం తేడా ఉన్నా ఆ మస్టర్ షీటును తిరస్కరిస్తారు. అంతేకాకుండా ఫొటో తీసేటపుడు అక్కడున్న కూలీల్లో కనీసం ఒకరైనా కళ్లు ఆర్పినట్లు చేస్తేనే ఆ ఫొటోను ఎన్ఎంఎంఎస్ నమోదయ్యేలా యాప్‌ను ఆధునీకరించారు.

యాప్‌లో కొత్త నిబంధనలు ఇలా...

2025, జనవరి 27 నుంచి అమల్లోకి వచ్చిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం) యాప్ ద్వారా కూలీల నమోదులో కేంద్రం కొత్త నిబంధనల అమలును తప్పనిసరి చేసింది. ఈ నూతన ప్రక్రియలో గతంలో ఎపుడో తీసిన ఫొటోలను ఆన్‌లైన్‌లో నమోదుకు వీలు లేకుండా అదనపు జాగ్రత్తలు చేపట్టింది. ఏ రోజు ఎంతమంది కూలీలు హాజరయ్యారన్నది క్షేత్రస్థాయిలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్ లేదా మేట్లు ఆన్‌లైన్‌లో మస్టర్ నమోదు చేయాలి. పని ప్రదేశంలో కూలీలు పనిచేస్తున్న ఫొటోను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలి. ఈ మస్టర్ ఆధారంగానే వారానికి ఒకసారి కూలీలందరికీ వేతనాల చెల్లింపులు సంబంధించిన పిఅండ్ ట్రాన్స్‌ఫర్ ఓచర్లను ఎఫ్ఐఓ ఆన్‌లైన్లో తయారు చేస్తారు. ఈ ఎఫ్‌టిఓల ప్రకారమే నేరుగా కూలీల బ్యాంకు ఖాతాలకు జమవుతుంటాయి. ఇది కొన్నేళ్లుగా జరుగుతున్న విధానమే. అయితే ఇందులో ఫొటోలో కూలీల సంఖ్య ఎంతమంది ఉన్నారు, అది ఎప్పటిది అనే విషయాన్ని పెద్దగా పట్టించుకునేవారు కాదు. కనీసం ఒక్క మనిషి ఫొటోలో లేకపోయినా మస్టర్‌లో పేర్కొనే కూలీల సంఖ్య ఆధారంగా బిల్లులు చెల్లించేవారు. అయితే ఇకపై ఫొటోలో సంఖ్యకు, మస్టర్ సంఖ్యకు ఏమాత్రం తేడా ఉండకూడదన్నదే కఠినమైన నిబంధన.

ఉపాధి సిబ్బందికి భారంగా కొత్తయాప్‌లు

ఉపాధి పథకంలో కొత్త యాప్ ప్రవేశం సిబ్బందిపై అదనపు భారం పడనుంది. ఓ వైపు తగినంతమంది సిబ్బంది లేక కొన్నిచోట్ల ఇన్‌ఛార్జి బాధ్యతలను నిర్వహిస్తున్నారు. కూలీల హాజరు వేతనాల బిల్లుల నమోదు తదితర ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. ఈ వెబ్‌పోర్టల్ పూర్తిగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధీనంలో పనిచేస్తుంది. ఈ పథకం అమలులో రోజువారి పనికి హాజరవుతున్న కూలీల వివరాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణకు ఆన్లైన్ వెబ్ పోర్టల్ కు అనుసంధానంగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ ఎం ఎం ఎస్) పేరుతో ప్రత్యేక మొబైల్ యాప్ ను కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ చాలా ఏళ్లుగా వినియోగిస్తుంది ఇప్పుడు యాప్‌ల నిర్వహణలో కేంద్రం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది ఇందులో భాగంగా అందులో కొన్ని సాంకేతిక మార్పులు చేసింది.

జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త నిబంధనలు ఇవే..

- పనిచేసే చోట తీసే ఫోటోలోని కూలీల సంఖ్య మస్టర్లో సంఖ్య ఒకేలా ఉండాలి.
- ఫోటోలో తేడా ఉంటే ఆ మస్టర్ షీట్ను పరిగణించు వేతనాలు చెల్లించరు.
- ఫోటో తీసేటప్పుడు కూలీలు కళ్లు ఆర్పినట్లు ఉండాలి. అలా ఉంటేనే ఆ ఫోటో ఆన్లైన్లో అప్లోడ్ అయ్యేలా యాప్ ఆధునీకరణ. (ఇప్పటివరకూ మస్టర్ షీట్‌తో నమోదు వేసి ఫోటోలో కూలీలు ఉన్నా లేకున్నా పరిగణలోకి)
- డిమాస్టర్ ద్వారా రైతులకు సంబంధించిన పనులన్నీ యాప్ ద్వారా క్షేత్రస్థాయి సిబ్బంది నమోదు చేయాలి.
- ఫోకస్ ఏరియా యాప్ ద్వారా ఉపాధి పథకం కింద చేపడుతున్న ప్రతి పనిని ఈ యాప్ లో నమోదు చేయాలి.
- ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా కమ్యూనిటీ పనులు చేసేటప్పుడు ప్రతిరోజూ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలి.

ఉపాధి పనులు పారదర్శంగా చేపడుతున్నాం..

డాక్టర్ బండారు సుబ్రహ్మణ్యం, ఉపాధి హామీ సహాయ పథక సంచాలకులు, చిత్తూరు

ఉపాధి పనులను పారదర్శకంగా చేపట్టేందుకు క్షేత్రస్థాయిలో ఎన్.ఎం.ఎం.ఎస్ యాప్, డి మాస్టర్, ఫోకస్ ఏరియా యాప్‌లో గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఉపాధి పనుల సంబంధించి ఫోటోలను యాప్లలో అప్లోడ్ చేస్తున్నాము. ఉపాధి పనుల పారదర్శకం, క్షేత్రస్థాయిలో అక్రమాలకు పాల్పడకుండా ఉండేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఉపాధి కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి పని కల్పించడం. ప్రతి రైతుకు సహజ వనరుల యజమాన్య పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటాం.

కూలీలను నిలబెట్టి ఫొటోలను తీస్తున్న ఉపాధి అధికారులు

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, డీఈఈ, ఏఈఈ, ఈఓ పిఆర్‌డిలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా ప్రతి మండలంలో ప్రస్తుతం ఉన్న నీటి వనరులను గుర్తించి వాటి స్థితిగతులకు సంబంధించి ఈనెల 1 నుంచి మార్చి 15వ తేదీ వరకు జరుగుతున్న సర్వేలో బోర్‌వెల్స్, చేతి పంపుల నిర్వహణ పూర్తి వివరాలను పక్కాగా క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను అందజేయాలని ఆదేశించారు. ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు వారి పరిధిలో తాగునీటి సరఫరాకు సంబంధించి పూర్తి సమాచారాన్ని సిబ్బంది ద్వారా తెలుసుకోవాలన్నారు. మండల స్థాయిలోని సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పంచాయతీల వారీగా పనిచేస్తున్న బోర్ల వివరాలు, రిపేర్‌లో ఉన్న బోర్లు, చేతి పంపులు, డీపెనింగ్‌కు అవకాశం ఉన్న బోర్ల వివరాలు, ఇది వరకు ట్రాన్స్ పోర్టేషన్ చేస్తున్న గ్రామాలు, టై అప్ ద్వారా నీటి సరఫరా చేస్తున్న గ్రామాల పూర్తి వివరాలను వివరంగా సేకరించడం ద్వారా తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకోవలసిన చర్యలపై పకడ్బందీ ప్రణాళికను సిద్ధం చేసేందుకు అవకాశం ఉంటుందని, ఈ దిశగా అధికారులందరూ సమిష్టిగా పనిచేయాలని అన్నారు. పంచయతీ సెక్రెటరీలు వారు గ్రామపరిధిలో ఉన్న నీటి వనరులు కలుషితం కాకుండా సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా రక్షిత మంచి నీటి ట్యాంక్‌ను నెలరోజులకు ఒకసారి శుభ్రం చేయాలని, ఇందుకు సంబంధించి గూగుల్ ఫోటోలను ఎంపిడిఓలు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా తనిఖీ చేయాలన్నారు. మండల స్థాయిలో ఎంపిడిఓలు, మున్సిపల్ స్థాయిలో కమిషనర్లు వైద్య ఆరోగ్యశాఖతో సమన్వయం చేసుకుని సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ప్రాంతాలు, వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలు సమాచారాన్ని పొంది తద్వారా వ్యాధులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా కలుషిత నీటిని తాగడం వలన అనేక వ్యాధుల భారిన ప్రజలు పడేందుకు అవకాశం ఉందని, దీనికి సరైన పరిష్కారంగా సురక్షితమైన తాగునీటి సరఫరానే అని ఈ దిశగా అధికారులు పనిచేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా సచివాలయంలోని అన్ని కార్యాలయాలకు చెందిన అధికారులు, సిబ్బంది సమయపాలన కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయంలోని జ్యోతిరావు పులే భవన్, వివేకానంద భవన్, అంబేద్కర్ భవన్‌లోని అన్ని కార్యాలయాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని కార్యాలయాలలోని అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ కార్యాలయపు వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సచివాలయంలోని మూడు భవనాల్లో ఇది వరకే వివేకానంద భవన్, జ్యోతిరావు పూలే భవన్‌కు పెయింటింగ్ చేయించడం జరిగిందన్నారు. అలాగే అంబేద్కర్ భవన్‌లో కూడా పెయింటింగ్ చేయడం జరుగుతున్నదన్నారు. కార్యాలయపు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా వుండేలా చూసుకోవడం ప్రతిఒక్కరి భాధ్యత అని, నిరుపయోగమైన వస్తువులను తొలగించాలన్నారు. ప్రతి సెక్షన్‌లోనూ ఫైల్స్‌ను సక్రమంగా ఉంచుకోవాలని, సరైన రీతిలో భద్రపరచుకోవాలని ఆదేశించారు. జిల్లా సచివాలయ ఆవరణంలో వాహనాల పార్కింగ్‌కు షెడ్‌ను నిర్మించేలా చర్యలు చేపట్టాలని ఏఓను ఆదేశించారు. కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వివిధ శాఖల కార్యాలయాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీలు

నిర్ణీత గడువులోపు పరిష్కరించండి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులలో అందిన అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించేలా తహశీల్దార్లు ప్రత్యేక శ్రద్ధపెట్టి పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తహశీల్దార్లను ఆదేశించారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డిఓలు తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, ఆర్ఐలు, ఏడి సర్వే, మండల సర్వేయర్లు, ఇతర సంబంధిత అధికారులతో రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరిగిందని, ఈ సదస్సుల్లో అందిన అర్జీల పరిష్కారంపై రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టి భాద్యతతో పని చేయాలని ఆదేశించారు. జిల్లాస్థాయిలో పరిష్కారం అయ్యే అర్జీలను ప్రణాళికాబద్ధంగా నిర్దేశించిన గడువు లోపు పరిష్కరించాలని అన్నారు. అర్జీల పరిష్కారానికి సంబంధించి క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీదారునికి సమాచారం అందించి వారి సమక్షంలో వాస్తవ పరిస్థితులను తెలుసుకుని పరిష్కారానికి చొరవ చూపాలని తెలిపారు. అర్జీదారులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా కార్యాలయంలో సంబంధిత అధికారులు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చే ప్రజలకు న్యాయం చేయాలని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది వారి విధులను సమర్థవంతంగా భాద్యతాయుతంగాచేయాలన్నారు. జేసి జి.విద్యాధారి, డిఆర్ఓ కె.మోహన్ కుమార్, ఆర్డిఓలు, తహశీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పేద ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు

ప్రణాళికలను సిద్ధం చేయండి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రభుత్వ, ప్రైవేట్ ప్రజల భాగస్వామ్యంతో ప్రతీ ఇంటిని, అందరి జీవితాలలో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పి- 4పాలసీని అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. విజయవాడ నుండి గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జీరో పావర్టీ (దారిద్ర్య నిర్మూలనం) నియోజకవర్గ విజన్ ప్లాన్స్, ఎమ్ఎస్ఎం ఈ సర్వేకు సంబంధించి సంబంధిత కార్యదర్శులతో కలసి జిల్లా కలెక్టర్లలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు చిత్తూరు జిల్లా సచివాలయం నుండి వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, డిఆర్ఓ కె.మోహన్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫెరెన్స్ ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి ఉగాది నాడు ప్రారంభించనున్న పి-4 (ప్రజా ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం) పాలసీ అమలుపై జిల్లాస్థాయి నుండి గ్రామస్థాయి వరకు చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. దారిద్ర్య నిర్మూలనలో (జీరో పావర్టీ) భాగంగా జిల్లాలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రణాళికలను రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం సూచనలు తెలుసుకోవడం ద్వారా ఆర్థికంగా పేదప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం జీరో పావర్టీలో భాగంగా పి-4 విధానంపై అందరి అభిప్రాయాలను సేకరిస్తుందని ఈ ప్రక్రియలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఫిబ్రవరి 7 నుండి 22వ తేదీ వరకు సర్వే నిర్వహించాల్సి ఉంటుందని, ఈ సర్వేలో జిల్లా ప్రజలను భాగస్వామ్యం చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

వెనుకబడిన వర్గాలు విద్యనభ్యసించాలి

ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు

బిసీల జాతీయ సెమినార్లు చిత్తూరు ఎంపి ప్రసాదరావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు విద్యనభ్యసించినప్పుడే రాజ్యాధికారం వైపు అడుగులేసేందుకు అవకాశం దొరుకుతుందని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ డిప్యూటీ ఫ్లో లీడర్, జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ సభ్యులు, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అభిప్రాయపడ్డారు. బీసీలకు పార్లమెంటులో ప్రాధాన్యత కల్పించాలనే అంశంపై గురువారం ఢిల్లీలోని ఆంధ్ర భవన్లో జరిగిన నేషనల్ బీసీ సెమినార్లో బిసి సంఘం నేతలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తమ హక్కులు, ప్రయోజనాల సాధన కోసం అన్ని సామాజిక వర్గాలు పోరాటం చేయడంలో తప్పు లేదని, అది రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. దేశంలోని అన్ని వనరుల పై వెనుకబడిన వర్గాలకు హక్కు ఉందని, ఐక్యతతోనే వాటిని సాధించుకోవచ్చని ఆయన తెలిపారు. పార్లమెంటులో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలని చేస్తున్న పోరాటాన్ని భారత ప్రభుత్వం తప్పక గుర్తిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు బీసీలకు అండగా ఉంటారని తెలిపారు.

ఎన్సిసి విద్యార్థులకు ప్రతిభా పత్రాలు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: ద్రావిడ విశ్వవిద్యాలయంలోని ఎన్సిసి విద్యార్థులకు ప్రతిభాపత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో క్యాంప్ ఫైర్ కార్యక్రమాన్ని అసోసియేట్ ఆఫీసర్ డాక్టర్ శ్రీ ప్రియ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య దొరస్వామి, కుల సచివులు ఆచార్య కిరణ్ కుమార్ హాజరయ్యారు. ఎన్సిసిలో క్యాంప్ ఫైర్ కార్యక్రమం ఆనవాయితీగా జరుగుతోందని, ఈ కార్యక్రమంలో విద్యార్థుల మధ్య సంబంధాలు మెరుగు పడతాయని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు.

మేలైన పశు సంతతిని పెంచాలి

చిత్తూరు జిల్లా సంయుక్త సంచాలకులు ప్రభాకర్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మేలైన పశు సంతతిని పెంచాలని చిత్తూరు జిల్లా సంయుక్త సహాయకులు ప్రభాకర్ అన్నారు. గురువారం మండలంలోని కురుమాయపల్లి గోపాలమిత్ర కేంద్రంలో పేయి దూడల ప్రదర్శన కార్యక్రమం పశు సంతతి పరిశీలన ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలు జాతి పశువులను సంరక్షించుకునేందుకు ప్రతి పాడిరైతు చూడాలని రాష్ట్ర ప్రభుత్వం పశు సంతతి పరిశీలన కార్యక్రమం నిర్వహించి బహుమతులు అందిస్తుందని తెలిపారు. పేయి దూడలను సంరక్షించడంతోపాటు మెలుకువలు పాటించాలని వీటి ద్వారా సంతాన ఉత్పత్తి బాగా జరుగుతుంన్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఉపసంచాలకులు ఆరిఫ్, బాలసుబ్రమణ్యం, సహాయ సంచాలకులు ఆసిఫ్, ఝాన్సీ, పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

కేన్సర్ నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: కేన్సర్ వ్యాధిని ముందే గుర్తిస్తే నయం చేసుకోవచ్చని ప్రధాన వైద్యురాలు శిరీష అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్ నిర్మూలనపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కేన్సర్ పరీక్ష చేసుకోవాలని, కేన్సర్‌ను ముందుగా గుర్తించి తగిన మందులు వైద్యం చేసుకుంటే నివారించవచ్చు అన్నారు. డాక్టర్లు స్వరూప్, విజయ్ కుమారి, రాధా భవాని, అబిత, భార్గవ్ హెడ్ నర్స్ సుమలత పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

వ్యవసాయ అధికారి చిట్టిబాబు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రైతులకు అందుబాటులో యూరియా ఉందని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ అధికారి చిట్టిబాబు అన్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులకు రబీ సీజన్‌లో 1500 ఎకరాలలో ఈ పంట నమోదు చేయడం జరిగింది. వరి వేసే ప్రతి రైతుకు రైతు సేవా కేంద్రాల్లో రెండు రోజుల్లో యూరియా అందుబాటులోకి రావడం జరుగుతుందన్నారు. కాబట్టి రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని యూరియాను ఎక్కువ మోతాదులో వేయడం వలన చీడపీడలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది కాబట్టి రైతులందరూ వరి పంటకి ఎకరాకు 30 నుంచి 35 కేజీలు వేసుకోవాలన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

ప్రజాశక్తి- సోమల: మండలంలోని పొదలకుంటపల్లి గ్రామంలో గురువారం పంచాయతీ కార్యదర్శి ఫయాజ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులచే పొగను వీధులలో స్ప్రే చేశారు. ఇటీవల గ్రామంలో మురుగునీటి కాలువలు శుభ్రం చేయించడం పిచ్చి మొక్కలు తొలగించడం చేశామని ప్రస్తుతం దోమల నివారణ కోసం ఫాగింగ్ చేసినట్టు ఆయన తెలిపారు.

ఎండ తీవ్రతకు జాగ్రత్తలు తీసుకోండి

ప్రజాశక్తి-వెదురుకుప్పం : ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని పచ్చికాపల్లం ప్రాథమిక వైద్యాధికారిణి డాక్టర్ ప్రవీణ తెలిపారు. వేసవి ప్రారంభం నుంచే ఈ కింది జాగ్రత్తలు పాటిస్తే ఎండ తీవ్రతను అధిగమించవచ్చని చెప్పారు.

డాక్టర్ ప్రవీణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, పచ్చికాపల్లం వెదురుకుప్పం మండలం

ఎండలో బయటకు వెళ్లేటప్పుడు నెత్తికి టోపి లేదా రుమాలును ఉపయోగించాలి. తెలుపురంగు కాటన్ వస్త్రాలను ధరించాలి. కళ్ళ రక్షణకు సన్ గ్లాసెస్ ఉపయోగించాలి. వీలైనంత వరకు ఇంట్లో ఉండటానికి ప్రయత్నించండి. దాహం వేయకపోయినా తరుచుగా నీటిని తాగండి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు, ఓఆర్ఎస్ కలిపిన నీటిని తాగవచ్చును. వడదెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రాకుంటే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి. ఎండలో నుంచి వచ్చిన వెంటనే నీరు, నిమ్మరసం, కొబ్బరినీరు వంటివి తీసుకోవాలి. తీవ్రమైన ఎండలో బయటికి వెళ్ళినప్పుడు తల తిరుగుట, వాంతులు, ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే దగ్గరలోని వైద్యులను సంప్రదించండి. ఇంటి వాతావరణం చల్లగా

ఉంచుకోండి. ఫ్యాను వాడండి. చల్లని నీటితో స్నానం చేయండి. తక్కువ ఖర్చుతో కూడిన చల్లదనానికి ఇంటి పైకప్పుల పై వైట్ పెయింట్, కూల్ రూఫ్ టెక్నాలజీ, క్రాస్ వెంటిలేషన్, థర్మోకోల్ ఇన్సులేషన్‌ను ఉపయోగించండి. మేడపైన, ఇంట్లో మొక్కలు ఉంటే భవనాన్ని చల్లగా ఉంచి ఉష్ణతాపాన్ని తగ్గిస్తాయి. తగినన్ని నీళ్లు తాగుతూ పైన తెలిపిన జాగ్రత్తలు తీసుకుంటే ఈ వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆమె తెలిపారు.

జడ్పీ సీఈవో తనిఖీలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని జెడ్పి సీఈవో వి.రవికుమార్ నాయుడు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులు పరిశీలించారు. అనంతరం మండలంలో తాగునీటి పరిస్థితిపై ఆరా తీశారు. స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి హాస్టల్‌లో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అలాగే జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, పీఆర్ ఏఈ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి- వెదురుకుప్పం : వ్యవసాయ సహాయ సంచాలకులు శివకుమార్ పుంగనూరు, మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యవసాయ సహాయ సంచాలకులు శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం వారు నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులు విక్రయించాలని ప్రతి రైతుకు కొనుగోలు చేసిన వాటికి రసీదు ఇవ్వాలని తెలిపారు. గడువు తీరిపోయిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు రైతులకు విక్రయించకూడదని, ఎరువులు, విత్తనాల చట్టాలకు వ్యతిరేకంగా విక్రయిస్తే కఠిన చర్యలు చేపడతామని దుకాణదారులకు హెచ్చరించారు. వ్యవసాయ అధికారి వనిత, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సంఖ్య పెంచకుంటే

సెంటర్ మార్పు చేస్తాం : ఐసిడిఎస్ పీడీ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: కార్వేటి నగరం ప్రాజెక్టు ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లి మిట్ట, దళితవాడలో వున్న రెండు అంగన్వాడీ సెంటర్లను గురువారం చిత్తూరు ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం అంగన్వాడీ కేంద్రాలలో స్టాకు, హాజరు రిజిస్టరు పలు రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీలో ఓ సెంటర్లో కేవలం ఒకే ఒక పిల్లవాడు ఉండడంతో పిల్లల సంఖ్య పెంచాలని లేకుంటే సెంటర్‌ను మార్పు చేస్తామని అన్నారు. మరో సెంటర్లో కొత్త వర్క్ అయినప్పటికీ కిచెన్ గార్డెన్ ఇతర రికార్డ్స్ అన్ని కూడా బాగానే ఉన్నాయని, ఇంకా ప్రీస్కూల్ శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ఉసిరి కాయలు వితరణ

ప్రజాశక్తి -సదుం: సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కె.కరీముల్లా, ప్రియ దంపతులు తమ వ్యవసాయ క్షేత్రంలో సేంద్రీయ పద్ధతిలో పండించిన 175 కిలోల ఉసిరికాయలను గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.కరీముల్లా విద్యార్థులకు ఉసిరికాయలో ఉన్న ఔషధ గుణాలను గురించి, ఉసిరి వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.జయకుమార్ రెడ్డి, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బి.సుబ్రహ్మణ్యం, పిడి కిషోర్, మహిళా ఉపాధ్యాయులు చెంచులక్ష్మీ, కుమారి, ఉషా, జానకి, శశి కళ పాల్గొన్నారు.

బలహీన వర్గాల బలోపేతానికి కృషి

మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

ప్రజాశక్తి- శాంతిపురం

కల్లుగీత కులాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని సదుద్దేశంతో వారికి మద్యం దుకాణాల్లో కేటాయింపుల్లో 10శాతం ఇవ్వాలని కూటమి ప్రభుత్వం భావించి, బీసీలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేర్చుస్తూ బీసీల పక్షపాతిగా ప్రభుత్వం వ్యవహరించడం చూసి ఓర్వలేని తాడేపల్లి సైకోలు ఈ ప్రక్రియను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. బీసీలకు మద్యం దుకాణాలు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా సుమారు 20 పిటిషన్లు పడితే అందులో 12 పిటిషన్లు వైసీపీ నేతలు నేరుగా వేసినవి, మిగిలినవి వారి సానుభూతి పరులతో వేయించినవి అని, దాంతో వైసీపీ కుట్రలు బట్ట బయలయ్యాయని బీసీల వ్యతిరేకిగా జగన్ రెడ్డి మరోసారి నిరూపితమయ్యాడని అన్నారు. జగన్ రెడ్డి ఎంత అడ్డుకున్నా బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం ఎప్పుడు కృషి చేస్తూనే ఉంటుందని అన్నారు.

అర్హులకే రుణాలు అందాలి..: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పలమనేరు: పట్టణంలోని ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి తన కార్యాలయంలో గురువారం మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం తరపున స్వయం ఉపాధి పథకాలకు అందించనున్న వివిధ కార్పొరేషన్ రుణాలు అర్హులకు మాత్రమే అందేలా చూడాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ రుణాలకు అందుతున్న అర్జీలను పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అదేవిధంగా రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ఇప్పటినుంచే నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గంగన్న శిరస్సు ప్రాజెక్టుకు సంబంధించిన డిపిఆర్ పూర్తి కావడంతో అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం టౌన్‌హాల్, ఎస్టీపీ ప్రాజెక్టు తదితర పనులపై చర్చించారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, టిపిబిఓ ఇందిరా, ఏఈ స్నేహప్రియా, సర్వేయర్ ఆంజనేయులు, మెప్మా మేనేజర్ బాబా పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భారీ వాహనాలతో నిత్యం ట్రాఫిక్ అంతరాయం

ప్రజాశక్తి- కార్వేటినగరం: సంస్థానాధీశులు కాలంలో కార్వేటినగరం వీధులు సువిశాలంగా దర్శనమిస్తూ, చారిత్రిక కట్టడాలతో చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటూ సుందరనగరంగా విరాజిల్లింది. సంస్థానాధీశుల కాలం అనంతరం నగరం వీధులు కొద్దికొద్దిగా స్వార్థపరుల చేతుల్లో ఆక్రమణలకు గురై 150 అడుగుల విస్తారం ఉన్న వీధులు నేడు 50 అడుగులకు కుదించుకు పోవడం జరిగిందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. దీనికి తోడు రోజురోజుకు వాహనాల సంఖ్య పెరగడంతో పాటు, బెంగళూరు-శ్రీహరి కోటకు నిత్యం భారీ వాహనాలు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు పెరిగిపోవడంతో కార్వేటినగరంలో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారింది. నవంబర్ నుంచి ఏప్రిల్ వరకు రైతులు శ్రీరంగరాజపురం మండలంలోని షుగర్ ఫ్యాక్టరీకి చెరకు తరలిస్తూ ఉంటారు. దీంతో కంటైనర్లు వంటి భారీ వాహనాలు వచ్చినప్పుడు గాండ్లమిట్ట కూడలిలోని మలుపు వద్ద వాహనాలు తిరగలేక డ్రైవర్లకు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు, చెరకు లోడ్డు ఉన్న ట్రాక్టర్లు ఒకేసారి రావడంతో ఎక్కడి వాహనాలు అక్కడే ట్రాఫిక్ ఇరుక్కుపోవడంతో ద్విచక్రవాహనాలతో పాటు కనీసం పాదాచారులు కదలలేని పరిస్థితి ఏర్పడుతోంది. గతంలో ఎంతోమంది జిల్లా ఉన్నత అధికారులు, మంత్రులు సైతం ఈట్రాఫిక్‌లో చిక్కుకున్న రోజులు ఎన్నో ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా రోడ్డు విస్తరణ చేపడుతామని అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శలున్నాయి. ఇకనైనా రోడ్డు వెడల్పు చేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

గాండ్లమిట్ట వద్ద కంటైనర్లు రావడంతో ట్రాఫిక్ అంతరాయం

జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం వాల్ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దుర్గాదేవి ఆధ్వర్యంలో నులిపురుగుల నిర్మూలన కోసం మందులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ తొలి దశలోనే నులి పురుగులను నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. 10వ తేదీ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రతి పాఠశాలలో విద్యార్థులకు నులు పురుగులు మందులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎన్ఆర్ పురం: విద్యార్థులలో నులిపురుగుల నిర్మూలన అందరి బాధ్యత అని ఈనెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంకు సంబంధించి గోడపత్రికలను ఎంపీడీవో మోహన మురళి ఈ గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆరిమకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు డాక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, డాక్టర్ గిరి, డాక్టర్ గౌరీ, విద్యాధికారులు అరుణాచలం రెడ్డి, సబర్మతి పాల్గొన్నారు.

గంగవరం: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైద్యాధికారి మల్లికార్జున్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 10న 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణ గుళికలు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని తెలిపారు. డాక్టర్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలు వాడుకలోకి తేవాలి

ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి

గ్రామంలో పరిశుభ్రతను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: సంపద తయారీ కేంద్రాలు శుభ్రం చేసి వాడుకలోకి తేవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అందరి ఆరోగ్యాలు రక్షణగా ఉంటాయని ఎంపీడీవో హరి ప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం గంగాధర నెల్లూరు మండల పరిధిలోని కలిజవేడు పంచాయతీలోని కే నాసంపల్లి, తూగుండ్రం, ఆంబోదరపల్లి, దళితవాడ, మహాదేవ మంగళం గ్రామాలలో ఎంపీడీవో పర్యటించారు. తూగుండ్రం పంచాయతీ, తోపుకుంట, గ్రామంలో తాగునీటిని అందించాలని పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీపై అధికారుల సమక్షంలో విచారణ జరిపారు. సాధ్యమైనంత త్వరగా తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఆంబోదరపల్లి, మహదేవ మంగళ, దళితవాడ ప్రాంతాలలో చేపడుతున్న పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. డ్రైనేజీ కాలువలకు ఇరువైపులా ఉన్న ముళ్ళ చెట్లు కంపలు తొలగించి డ్రైనేజీలు శుభ్రపరిచి మురుగునీరు వెళ్ళుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్యాంకులు, ఎస్‌డబ్ల్యూపిసి పరిశుభ్రం చేసి పేడ దెబ్బలు చెత్తాలు తొలగించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పాతపాళ్యం సర్పంచ్ కృష్ణమ నాయుడు, తూగుండ్రం సర్పంచ్ శ్రీ బాబు, కలిజవేడు సర్పంచ్ నీలావతి, పంచాయతీ కార్యదర్శులు కుమార్, మురళి, లావణ్యరెడ్డి పాల్గొన్నారు.

చిరుత తెలివి!

బోను వున్నా చిక్కని వైనం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీ యూనివర్సిటీలో చిరుత కోసం ఉంచిన బోనులకు చిరుత చిక్కడం లేదు. అడవి లేదా కొండ ప్రాంతాలలో ఆహారం అందుబాటులో ఉండదు.. దీ కారణంగానే బోనులల్లో ఉంచిన ఆహారం కోసం వచ్చి చిరుత ఇరుక్కుంటుంది. అయితే యూనివర్సిటీలలో విరివిగా ఆహారం దొరకడంతో ముఖ్యంగా కుక్కలు అందుబాటులో ఉండడంతో బోను వద్దకు వచ్చి వెళ్లిపోతోందని ఫారెస్ట్ అధికారులు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న చిరుత స్విమ్స్, భారతీయ విద్యా భవన్, వేదిక యూనివర్సిటీ, ఎస్వి యూనివర్సిటీ పరిధిలోని

సంచరిస్తున్నట్లు పాదముద్రల ద్వారా తెలుస్తోంది. ఈ కారణంగా ఈ ప్రాంతంలో సంచరించే విద్యార్థినీ విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులు, ఈ సంస్థలకు వచ్చే ఇతరులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు అంటున్నారు.

క్రైం న్యూస్

నాటు తుపాకీ స్వాధీనం - ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: నాటు తుపాకీ స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు సిఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండలంలోని కేఎం ఖండిగ గ్రామంలో ఇద్దరు వ్యక్తులు నాటు తుపాకీలతో అడవి ప్రాంతంలో సంచరిస్తున్నారని సమాచారం రావడంతో సిఐ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. తమిళనాడు రాష్ట్రం గుడియాత్త తాలూకా వీలు దోసపాల్యం గ్రామానికి చెందిన గోపి, కేఎం కండిగ గ్రామంకు చెందిన ఆనంద అడవి పందులను, ఇతర జంతువులను వేటాడటం కోసం నాటు తుపాకీని తీసుకువెళుతూ ఉండగా పోలీసులు ఇరువురిని అదుపులో తీసుకుని అడవి జంతువుల వేటపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: గుర్తు తెలీని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బైరెడ్డిపల్లి – కుప్పం జాతీయ రహదారిలోని బైరెడ్డిపల్లి గ్రామసమీపానగల ఆంజనేయ స్వామి గుడి దగ్గర గురువారం ఉదయం 5 గంటలకు ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన మునేప్ప (70) అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. వీకోటలోని పెద్ద కూతురి ఇంటికి వెళ్తేందు కాలినడకన మునేప్ప బయలుదేరి మెయిన్ రోడ్డు వచ్చిన సమయంలో ప్రమాదం జరిగిందని మృతుని భార్య లక్ష్మమ్మ ఫిర్యాదులో తెలిపారు.

పిహెచ్‌సిలో జిల్లా వైద్యాధికారి తనిఖీలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: జిల్లా టీబీ, లెప్రసీ ఆఫీసర్ డిఆర్ వెంకట ప్రసాద్ గురువారం మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్ఠు వ్యాధి నివారణ ప్రభుత్వ లక్ష్యమని, లెప్రసీ సర్వే సరిగా చేస్తున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో టీబీ పేషెంట్లు 12 మంది ఉన్నారని, వ్యాధి నిర్ధారణ కాకుండా ఉన్న కేసులను సిబ్బంది పర్యవేక్షణలో ఉండేలా చూడాలని సూచించారు. అనంతరం హాస్పటల్‌లో రికార్డులను పరిశీలించారు. డాక్టర్ అనిల్, డాక్టర్ అరుణకుమార్, డిపిఎంఓ జాన్, ఫార్మాసిస్ట్ ఆయుబ్, స్టాఫ్ నర్సులు రెడ్డమ్మ, సుమిత్ర, లక్ష్మి రాజారెడ్డి పాల్గొన్నారు.

పిల్లారి కుప్పంలో మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - ఎన్ఆర్ పురం: మండలంలోని పిల్లారికుప్పం సచివాలయంలో టీబీ అలర్ట్ ఇండియా ఎన్జీవో ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో 250 మంది హాజరు కాగా వీరందరికీ జిఆర్‌బిఎస్, బిపి, హిమోగ్లోబిన్ పరీక్షలు చేయడం జరిగింది. 30 మందికి దగ్గు ఉండటంతో నమూనాలు కలెక్ట్ చేసి జిల్లా ఆఫీస్ పరీక్ష నిమిత్తం పంపించారు. టీబీ అలర్ట్ ఇండియా ఎన్జీవో వారు ఊపిరితిత్తుల సమస్యలున్న వారికి పెద్ద ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తారని ఈ అవకాశాన్ని ఎస్ఆర్ పురం మండల ప్రజలు వినియోగించుకోవాలన్నారు. డాక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, డాక్టర్ గిరి, డాక్టర్ గౌరీ, డాక్టర్ కనకరాజు, డిపిఎం, ఎస్‌టిఎస్ మోహన్ ప్రసాద్, నాగభూషణ్, సోమశేఖర్, ఫీల్డ్ ఆఫీసర్ శివభూషణం పాల్గొన్నారు.

ఆదాయ పన్ను మినహాయింపు హర్షనీయం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆదాయ పన్ను రూ.12 లక్షలు మినహాయింపు పై రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక పెన్షనర్స్ భవన్లో పెన్షనర్ల సర్వసభ్య సమావేశం జరిగింది. నాగరాజు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం హెల్త్ కార్డులు ఇతర పెన్షన్ల సమస్యలను జిల్లా సంఘం పరిష్కరించేందుకు కృషి చేస్తుందని అలాగే ఇటీవల పెన్షనర్లకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు.

ఎస్వి అగ్రికల్చర్ కళాశాలకు బాంబు బెదిరింపు

ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలకు బాంబులు పెట్టామని కళ